క్లుప్తంగా

అంగన్‌వాడీ సెంటర్లు మంజూరు

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి మండల ఐసీడీఎస్ పరిధిలో పీఎం జన్‌మన్ పథకం కింద కొత్తగా బొడ్డగొంది, లోతావారివీధిలలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు మంజూరైనట్టు సీడీపీవో దేవమణి తెలిపారు. ఈ కేంద్రాల్లో పని చేసేందుకు రెండు హెల్పర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైనట్టు చెప్పారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

చిన్నారులకు ఆధార్ నమోదు



రింతాడ సచివాలయంలో ఆధార్ నమోదును పరిశీలిస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: ఆరేళ్లలోపు వయసున్న చిన్నారుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. రింతాడ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఐసీడీఎస్ సిబ్బంది తమ కేంద్రాల్లో చిన్నారులను ఆధార్ కేంద్రానికి తీసుకువచ్చి నమోదు చేయించాలని ఆయన కోరారు.

వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కృషి



తిమోతి

జి.మాడుగుల: వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ప్రకటించడంతో వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజుకు మండలంలో చుట్టుమెట్ట గ్రోత్ ఇన్ క్రైస్ట్ మిషన్ పాస్టర్ వంతాల తిమోతి కృతజ్ఞతలు తెలియజేశారు. వారు విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ తనపై వైఎస్సార్‌సీపీ నమ్మకం ఉంచి బాధ్యతను వమ్ము చేయకుండా నిరంతరం పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. తిమోతికి వైఎస్సార్‌సీపీ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఐదు గ్రామాల్లో పీసా సభలు వాయిదా

గంగవరం : మండలంలో శుక్రవారం నిర్వహించాల్సిన పీసా గ్రామసభలు వాయిదా వేసినట్టు ఎంపీడీవో పీజీ రామకృష్ణ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 57 హేబిటేషన్‌లో ఈ నెల 19 నుండి 24 వరకు ఐదు రోజులు పాటు పీసా గ్రామసభలు నిర్వహించి ఉపాధ్యక్షులు ఎన్నికలు నిర్వహించాల్సిందన్నారు. ఇందుకు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆదేశాల మేరకు మండలంలో పీసా గ్రామసభలు నిర్వహించి ఉపాధ్యక్ష ఎన్నికలు జరగాలన్నారు. అయితే లక్కొండ, జగ్గంపాలెం ఉపాధ్యక్ష ఎన్నికలు పూర్తి అయ్యాయన్నారు. పిడతమామిడి, కొత్తాడ, గంగవరం, ఎండపల్లి, జడేరు గ్రామాల్లో పీసా సభలకు కోరం లేకపోవడంతో వాయిదా పడ్డాయన్నారు.

అనారోగ్యంతో మాజీ వైస్ ఎంపీపీ మృతి

జి.మాడుగుల: మాజీ వైస్ ఎంపీపీ తమర్బ బొంజునాయుడు(47) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి మృతి చెందినట్టు మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడు గురువారం రాత్రి 7:30గంటల సమయంలో కుళాయి వద్ద నేలపై పడి ఉండటాన్ని గమనించి ఇంటికి తీసుకొచ్చామని, అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను ఆస్పత్రికి తరలించటానికి అంబులెన్సుకు ఫోన్ ద్వారా సమాచారం అందించామని, వాహనం వచ్చేలోపే మృతి చెందాడని కుటుంబసభ్యులు చెప్పారు.. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌కు మృతుని భార్య కొండమ్మ ఫిర్యాదు చేశారు.

అమిత్‌షా వ్యాఖ్యలు దారుణం

ముంచంగిపుట్టు: డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో చేసిన వ్యాఖ్యలు దారుణమని గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం.ఎం.శ్రీను అన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత, బడుగుల ఆశాజ్యోతి బి.ఆర్.అంబేద్కర్‌పై మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా అమిత్‌షా మాట్లాడడం తగదన్నారు. బీజేపీ ఎంపీలు సైతం విపక్షలపై భౌతికదాడులకు పాల్పడుతూ, కేసులు పెట్టి గొంతు నొక్కే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా తక్షణమే చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని, తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.లేని పక్షన ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. నేతలు గాసిరాందొర, నర్సింగరావు పడాల్ పాల్గొన్నారు.

జంక్షన్.. నిత్యం టెన్షన్



బోసుబెడ రహదారిలో ప్రమాదకర మలుపు

- జాతీయ రహదారిలో ప్రమాదకరంగా కూడళ్లు
- పెరుగుతున్న ప్రమాదాలు
- పదుల సంఖ్యలో మృత్యువాత
- స్పీడ్ బ్రేకర్లు, స్టాపర్లు ఏర్పాటు చేయాలని స్థానికుల విజ్ఞప్తి



నిత్యం రద్దీగా ఉండే ఉన్నత పాఠశాల, ఆస్పత్రి రహదారి

అరకులోయటౌన్: మండలంలోని జాతీయ రహదారిలో పలు జంక్షన్లు ప్రమాదకరంగా మారాయి. పలు జంక్షన్‌ల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గడిచిన నెలల్లోనే బోసుబెడ సీబీఎం హోమ్, గుడ్ మార్నింగ్ రిసార్ట్స్ ఎదురుగా అతివే గంగా ప్రయాణిస్తున్న కార్లు ఢీకొన్న వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు మృతి చెందారు. పలు ప్రమాదాల్లో పశువులు మృతి చెందాయి. అరకులోయ పట్టణంలోని పలు రహదారుల్లో మలుపులు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. ఆయా చోట్లు స్పీడ్ స్టాపర్లు, స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో వాహనచోదకుల వేగానికి అడ్డు అదుపులేకుండా పోతోందని, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తే ఇటువంటి సంఘటనలు జరగకుండా చూడొచ్చని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికే పలు ప్రమాదకర మలుపుల వద్ద అరకులోయ పోలీసులు స్టాపర్లు ఏర్పాటు చేశారు. పూర్తిస్థాయిలో ప్రమాదకరమైన మలుపుల వద్ద ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రోడ్డు దాటడం కష్టమే

అరకులోయ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద రోడ్డు దాటేందుకు విద్యార్థులు, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రులకు వెళ్లె రోగులు కష్టపడుతున్నారు. అరకులోయ ప్రధాన రహదారి నుంచి ఆస్పత్రి మీదుగా చినలబుడు, పెదలబుడు, గన్నెల, లోతేరు తదితర ప్రాంత ప్రజలు ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. ఈ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లు, స్పీడ్‌స్టాపర్లు ఏర్పాటుచేయలేదు. ఈ మార్గంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది. పట్టణంలోని ఉన్నత పాఠశాల జంక్షన్ వద్ద దీంతో వాహనచోదకులు అతివేగంగా వాహనాలను నడపడంతో రోడ్డుకు ఒక వైపు నుంచి మరో వైపు రొడ్డు దాటేందుకు పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అరకులోయ ఏరియా ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు ఇటీవల తొలగించారని, దీంతో ప్రతీ రోజులు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఆస్పత్రి రోడ్డుతోపాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల గేటు వద్ద స్పీడ్ స్టాపర్లు గాని స్పీడ్ బ్రేకర్లుగాని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సుమారు 600 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఈ రోడ్డుపై స్టాపర్లు లేవు. ఈ మార్గంలో వాహనచోదకులు స్పీడ్‌గా వాహనాలు నడుపుతున్నారు. ఈ రహదారిలో చాలా మంది రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్టాపర్లు ఏర్పాటు చేయాలి.

– టి. మోహన్‌రావు, హెచ్‌ఎం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అరకులోయ

ప్రమాదాల నివారణకు చర్యలు



అరకులోయలోని ప్రమాదకర మలుపుల వద్ద స్పీడ్ స్టాపర్లు ఏర్పాటు చేశాం. పానిరంగినిలోని ఐటీడీఏ పెట్రోల్ బంక్ మలుపు వద్ద, బురదగెడ్డ, అల్లూరి సీతారామరాజు పబ్లిక్ స్కూల్, తదితర ప్రాంతాల్లో స్టాపర్లు ఏర్పాటు చేశాం. దీంతో ప్రస్తుతం ప్రమాదాలు జరగకుండా నివారించాం. ఆస్పత్రి రోడ్డులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆస్పత్రి వద్ద స్టాపర్లు ఏర్పాటు చేస్తాం. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం.

– గోపాలరావు, ఎస్ఐ, అరకులోయ

రోగులకు నిత్యం అవస్థలే



ప్రతీ రోజు అరకు ఏరియా ఆస్పత్రికి వందలాది మంది రోగులు వస్తుంటారు. ఈ రహదారిలో వాహనచోదకులు వేగంగా డ్రైవింగ్ చేస్తున్నారు. రోగులు రోడ్డు దాడేందుకు హడలిపోతున్నారు. వాహనచోదకులు అడ్డు అదుపులేకుండా వాహనాలు నడుపుతున్నారు. అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు స్పీడ్ స్టాపర్లు ఏర్పాటు చేయాలి.

– రాంబాబు, శిమిలిగుడ గ్రామం, అరకులోయ


పొంచి ఉన్న ప్రమాదం



సుజనపేట వద్ద కుంగిపోయి ప్రమాదకరంగా మారిన కల్వర్టు

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట పంచాయతీ సుజనపేట గ్రామ సమీపంలో ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిలో కల్వర్టు కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. ఇక్కడి ప్రధాన రహదారిపై ఈ పరిస్థితి నెలకొని 4 నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనదారులు నిత్యం భయం భయంగా ప్రయాణాలు సాగిస్తున్నారు. గత వారం రోజుల వ్యవధిలో నలుగురు ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురై, స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కల్వర్టుకు మధ్య పెద్ద గొయ్యి ఉండడంతో వాహనదారులకు ఇబ్బందిగా మారింది. దీంతో ప్రమాదం పొంచి ఉందని పలువురు చెబుతున్నారు. ఈ మార్గంలో కొత్తగా రాకపోకలు చేసే వాహనదారులు ఈ గోతి ఉన్నట్టు తెలియకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రిళ్ల ఈ మార్గంలో ప్రయాణం ప్రమాదకరంగా మారిందని వాహనచోదకులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదం బారిన పడడం తప్పదని చెబుతున్నారు. సుజనపేట వద్ద కుంగిన కల్వర్టును బాగుచేయాలని ఇప్పటికై పలుమార్లు గ్రామస్తులు కోరారు. కానీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై సుజనపేట గ్రామ గిరిజనులతో పాటు వాహనదారులు మండిపడుతున్నారు. ఇప్పటికై నా ఉన్నతాధికారులు స్పందించి కల్వర్టును బాగు చేసి, వాహన రాకపోకలకు ఇబ్బందులు తొలగించాలని సుజనపేట గ్రామస్తులు బొందు, మురళి, సుమన్, సురేష్, రామ్మూర్తిలు కోరుతున్నారు.

పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలి



విద్యార్థులు రాస్తున్న పరీక్షలను పరిశీలిస్తున్న ఎంఈవో కృష్ణమూర్తి

ముంచంగిపుట్టు: పకడ్బందీగా విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాలని ఉపాధ్యాయులకు ఎంఈవో కృష్ణమూర్తి సూచించారు. మండల కేంద్రంలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల–1, 2, బాలికల పాఠశాల– 1,2 లను ఎంఈవో కృష్ణమూర్తి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థులకు జరుగుతున్న సమ్మెటివ్ అసెస్మెంట్ పరీక్షలను పరిశీలించారు. విద్యార్థుల చదువుపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలని, అన్ని సబ్జెక్టుల్లో పట్టు సాధించాలని విద్యార్థులకు ఆయన సూచించారు. హెచ్‌ఎంలు మాణిక్యాలరావు, లక్ష్మీ, ప్రకాశం తదితరులున్నారు.

అకాల వర్షం.. అన్నదాతకు కష్టం



వర్షంలో గొడుగులతో కళాశాలకు వెళ్తున్న విద్యార్థులు



అరకు సంతలో విక్రయానికి తీసుకువచ్చిన టమాటాతో గిరిజన రైతులు



కాలీఫ్లవర్, క్యాబేజీలను విక్రయించేందుకు ఎదురుచూస్తున్న రైతులు



వలసగెడ్డలో పంటలపై కప్పిన టార్పాలిన్లు



ముంచంగిపుట్టులో కురుస్తున్న వర్షం

డుంబ్రిగుడ: మండలంలోని బంగాళాఖాతం తుపానుతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం వర్షం ఉదయం నుంచి సాయంత్రం వరకు పడింది. వారపు సంతకు వెళ్లే గిరిజనులతో పాటు కళాశాల, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతూ గొడుగులతో వెళ్తున్నారు. ఉదయం వాహనాలు లైట్‌ల సహాయంతో రాకపోకలు సాగించాయి. పర్యటక కేంద్ర చాపరాయిలో వర్షం కారణంగా పర్యాటకులు అంత మాత్రం వచ్చారు.

రైతులకు తీరని నష్టం : మండలంలోని ప్రతి శుక్రవారం నిర్వహించే వారపు సంతకు తుపానుతో గిరిజన కూరగాయల రైతులు నష్టపోతున్నారు. గురువారం సాయంత్రం నుంచే సంతలో రైతులు కూరగాయలు, ఇతర ఉత్పత్తులను శుక్రవారం నిర్వహించే వారపుసంతలో విక్రయానికి తీసుకొచ్చారు. ఉదయం నుంచే వర్షం కుండపోతగా కురుస్తుండడంతో రైతులు తీసుకువచ్చిన కూరగాయలను కొనుగోలు చేసే వారి కోసం ఎదురుచూశారు. ఇదే అదునుగా చేసుకొని వ్యాపారులంతా సిండికేట్‌గా రైతులకు రేట్లపై గండి కొడుతున్నారు. టమాటా కిలో రూ. 400 నుంచి రూ.600లకు, క్యారెట్ గంప ధర రూ. 600 నుంచి 800ల వరకు ధర పలికింది, క్యాలీఫ్లవర్ కావిడి రూ.800 నుంచి రూ.1000 వరకు ధరలు పలికాయి, క్యాబేజీ కవర్ సంచి బస్తా రూ.600 నుంచి రూ.800 వరకు పలికాయి. అయితే ఈ వారం రేట్లతో పోలిస్తే గత వారం వాటికి రెండింతలు రేటు ఉండేదని గిరిజన రైతులు చెప్పారు. గతవారం టమాట ధర రూ.800 నుంచి రూ.1200 కాగా ఈ వారం ధరలు తగ్గాయి, క్యారెట్, క్యాలీఫ్లవర్,, క్యాబేజీ తదిర కూరగాయలు వర్షాలకు పాడవకుండా కవర్లతో కప్పి ఉంచారు.

ముంచంగిపుట్టు: తుపాను ప్రభావంతో మండలంలో శుక్రవారం ఉదయం నుంచి చిరు జల్లులు కురుస్తేనే ఉన్నాయి. దీంతో రోడ్లు అన్నీ జలమయమయ్యాయి. వర్షపు జల్లులతో గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారు. పలుచోట్ల వరి కోతలు చేసి, వరిని కుప్పలుగా పోసి ఉన్నాయి. తుపానుతో గిరిజన రైతులు వరి కుప్పలపై టార్పాలిన్లు కప్పి వర్షానికి పంట పాడవకుండా శ్రమిస్తున్నారు. మరికొన్ని చోట్ల కోత కోసిన వరి, సామలు, రాగులు పంటలు పొలాల్లో ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గిరిజన ప్రాంతం అంతటా చెదురుముదురు వర్షాలు పడుతుండడం ఆకాశంలో కారుమబ్బులు కన్పిస్తుండటం గిరిజన రైతులు ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఏర్పడింది. పంట చేతికి వచ్చే సమయంలో తుపాన్ ప్రభావంతో గిరిజన రైతులు పంటను కాపాడుకునేందుకు నానా కష్టాలు పడుతున్నారు.

సీలేరు: జి.కె.వీధి మండలం దుప్పులవాడ, దారకొండ, గుమ్మిరేవుల పంచాయతీల్లో అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు చేతికి అందొచ్చిన పంటలు తడిసి తీవ్రమైన నష్టం వాటిల్లిందని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సీజన్‌లో ఎక్కువగా మినప, రాజ్‌మా, చిక్కుల్లు , రాగులు ,వంటి పంటలను అధికంగా పండిస్తుంటారు. ఈ ప్రాంతంలో రెండు నెలల క్రితం సెప్టెంబర్ 8న సంభవించిన తుపానుతో ఇక్కడ వేసిన వరి, కూరగాయల పంటలు బాగా దెబ్బతిని గిరిజన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుతం మినప, రాజ్‌మా, రాగులు, సామలు పంటలు బాగా పండి కోత దశలో ఉన్న తరుణంలో ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలకు ఈ పంటలు కూడా నష్టం వాటిల్లే పరిస్థితి నెలకొందని ఈ ప్రాంత రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వలసగెడ్డ గ్రామంలో ఆనప పంట కోత పూర్తి కావడంతో కళ్లం వద్దనే కుప్ప వేశారు. తుపాను ప్రభావంతో అకాల వర్షాలు రావడంతో పంట తడిసిపోకుండా టార్పాలిన్ కవర్లు కప్పి రక్షణ చర్యలు చేపట్టినప్పటికీ వర్షానికి కింద భూమి తడిసిపోవడంతో పంట పాడైపోతుందని గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి పంట నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని గిరిజన రైతులు కోరుతున్నారు.

గిరిజనుల గళాన్ని పార్లమెంట్‌లో వినిపించడం హర్షణీయం



చింతపల్లిలో మాట్లాడుతున్న ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు బాలయ్య పడాల్

చింతపల్లి: ఏజెన్సీలో గిరిజన సమస్యలపై పార్లమెంటు సమావేశాల్లో అరకు ఎంపీ తనూజరాణి ప్రస్తావించడం ఎంతో హర్షించదగ్గ విషయమని చింతపల్లి ఎంపీపీ కోరాబు అనూషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య పడాల్ అన్నారు. వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. మన్య ప్రాంతంలో గిరిజనులకు గుండె కాయలాంటి జీవో నెం– 3 అమలు సాధనకై తమ ప్రాంత ఎంపీ పార్లమెంట్‌లో ప్రస్తావించడంతో యావత్ గిరిజన ప్రజానీకం అభినందిస్తుందన్నారు. ఇప్పటివరకు ఎంతో గిరిజన ప్రజాప్రతినిధులు ఉన్నా నేటి వరకు పార్లమెంటులో ఈ సమస్య పట్ల ప్రస్తావించలేదని తొలిసారిగా తమ గళాన్ని వినిపించడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ జీఓ నెం–3 రద్దు వలన గిరిజన ప్రాంతంలో ఎంతోమంది నిరుద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల మేలుకు కొత్త చట్టాలు చేయకపోయినా పర్వాలేదు కాని ఉన్న చట్టాలను ప్రభుత్వాలు కాపాడాలని వారు కోరారు.

ముంచంగిపుట్టు: అరకు ఎంపీ గుమ్మా తనూజరాణి గిరిజన హక్కులు, చట్టాలపై లోక్ సభలో మాట్లాడడం హర్షణీయమని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు అన్నారు.ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో కొత్తగా ప్రభుత్వాలు ఏమీ చేయనవసరం లేదని, ప్రస్తుతం ఉన్న గిరిజన హక్కులు, చట్టాలు తీసేయకండి అని ప్రస్తావిచడం సంతోషించాల్సిన విషయమన్నారు. ముఖ్యంగా జీవో నెంబర్–3ను పునరుద్ధరించాలని, గిరిజన బిడ్డలకు గిరిజన ప్రాంతంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, భూ బదలాయింపు చట్టం పక్కాగా అమలు చేయాలన్నారు. గిరిజనులకు మాత్రమే గిరిజన ప్రాంతం భూమిపై హక్కులు చెందుతాయని, ప్రభుత్వం సైతం ప్రైవేట్ సంస్థగానే పరిగణించాలని ఎంపీ తనూజరాణి గళం విప్పడం గిరిజన జాతి మొత్తం హర్షించదగ్గ విషయమన్నారు. రానున్న రోజులలోను ఇదే తీరును కనబరచాలని ఆయన అన్నారు.

సత్వరమే సమస్యల పరిష్కారం



గిరిజన రైతుల నుంచి భూ సమస్యలకు చెందిన అర్జీలు స్వీకరిస్తున్న డిప్యూటి కలెక్టర్, ఆర్‌ఐలు

గూడెం కొత్తవీధి/కొయ్యూరు/రాజవొమ్మంగి: జిల్లాలో గూడెం కొత్తవీధి, కొయ్యూరు, రాజవొమ్మంగి మండలాల్లోని పలు గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు జరిగాయి. ఇందులో భాగంగా ఆయా మండలాల్లో భూ సమస్యలపై గిరిజనులు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ సందర్భంగా సదస్సుల్లో పాల్గొన్న జీకే వీధి తహసీల్దార్ రామకృష్ణ, కొయ్యూరులో డీటీ కుమారస్వామి, రాజవొమ్మంగిలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జానరాజ్ తదితరులు మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వినతులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ సదస్సులు జనవరి 8వ తేదీ వరకు జరుగుతాయని, సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. జీకే వీధిలో రీసర్వే డీటీ సత్యనారాయణ, సర్వేయర్ శ్రీను, వీఆర్వో అచిచబాబు, సర్పంచ్ కాసులమ్మ వైస్ సర్పంచ్ శ్రీధర్, ఎంపీటీసీ సరస్వతి, కోటేశ్వరరావు, కొయ్యూరులో డీటీ కుమారస్వామి, సర్పంచ్ సోమన్నదొర, రాజవొమ్మంగిలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జాన్‌రాజ్ , ఆర్ఐ చెల్లమ్మ, సర్పంచ్‌లు భీంరెడ్డి శుభలక్ష్మి, కొంగర మురళీకృష్ణ, రెవెన్యూ అధికారి వెంకటరెడ్డి, సర్వేయర్లు శివ, అప్పన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు చిన్నస్వామి తదితరులు

అరకులోయటౌన్: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు నెరవేర్చాలని కాంగ్రెస్ నాయకుడు పాచిపెంట చినస్వామి తదితరులు డిమాండ్ చేశారు. వారు శుక్రవారం విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో శనివారం పర్యటించనున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఏజెన్సీలో గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల న్యాయపరమైన సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. జీవో నంబర్ 3 చట్ట బద్దత కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజన ఆశ్రమాల్లో పనిచేస్తున్న సుమారు 1200 మంది హెల్త్ వాలంటీర్లను రెన్యూవల్ చేయాలన్నారు. నాయకులు గంగాధర్, భగత్‌రామ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఐక్య క్రిస్మస్ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న పాస్టర్లు, స్థానికులు

కొయ్యూరు: మండలంలోని బూదరాళ్ల పంచాయతీ కునుకూరులో యునైటెడ్ చర్చ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఐక్య క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాజేంద్రపాలెం యునైటెడ్ చర్చి పాస్టర్ సియోన్ కుమారి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీస్తు బోధనలు మానవాళికి ఆచరణీయమన్నారు. శాంతి, సోదరభావంతో మెలగాలని కోరారు. ప్రతీ ఒక్కరు సేవాభావం కలిగి ఉండాలని కోరారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పేదలకు దుప్పట్లు, చీరలు, దుస్తులను పంపిణీ చేశారు.